నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 15 డిసెంబర్ 2024 HYDERABAD




ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధిక్యం ప్రదర్శించి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం రైల్ నిలయంలోని జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ , పీసీపీవో మోహన్ రాజా నుంచి మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు, జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్ గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. ఎన్నికల్లో మొదటి స్థానంలో నిలిచినందుకు రైల్వే జీఎం మజ్దూర్ యూనియన్ నేతలకు శుభాకాంక్షలు చెప్పారు. -మారేడ్‌పల్లి

## నేటి నుంచి గ్రూప్ -2 పరీక్షలు

సిటీబ్యూరో : గ్రూప్–2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ఆది, సోమవారం జరిగే గ్రూప్–2 పరీక్షలకు 48,011 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. 101 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు సాఫీగా జరిగేలా ఐదుగురు రీజినల్ కో ఆర్డినేటర్స్, 15 మంది జాయింట్ రూట్ ఆఫీసర్, టీజీపీఎస్సీ ద్వారా 101 మంది అబ్జర్వర్లు, 3 పరీక్ష కేంద్రాలకు ఒకరు చొప్పున 33 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్ 101 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 458 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, ప్రతి పరీక్ష కేంద్రానికి 3 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8:30 గంటలకు మధ్యాహ్నం నుంచి 1:30 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. సైబరాబాద్, రాచకొండ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమ్మిగూడటం, సభలు, సమావేశాలు నిర్వహించడం, ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడం నిషేధమన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం సభ్యులు

## క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించింది

# కేసీఆర్ ప్రభుత్వమే

### క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి కేటీఆర్

జూబ్లీహిల్స్, డిసెంబర్14: క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా, అధికారికంగా గుర్తించింది కేసీఆర్ సర్కారేనని...డిసెంబర్ 26న బాక్సింగ్ డే సెలబ్రేషన్స్‌కు కూడా సెలవు ఇచ్చింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పేద క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని చర్చిలకు రూ.3 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని చెప్పారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్‌లోని ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణం, 43 ఎకరాల్లో శ్మశానవాటికల కోసం స్థలాల కేటాయింపు తదితర అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ యూనైటెడ్ క్రిస్టియన్ ఫోరం ప్రతినిధులు బిషప్ విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో స్టీఫెన్ పాల్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందడి









# దేశ రక్షణే.. అంతిమ లక్ష్యం కావాలి

### ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్.. ఆకట్టుకున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పరేడ్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : దేశ రక్షణ విభాగాన్ని ఎంచుకునే యువతకు అంతిమ లక్ష్యం దేశ భద్రతే కావాలని ఎయిర్ చీఫ్ మార్షల్, చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్ ఏపీ సింగ్ చెప్పారు. దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. యుద్ధ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ శక్తిని వివరించారు. పోరాట పటిమను కొనసాగించడం ద్వారానే కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటామని చెప్పారు. తోటి ఆఫీసర్స్‌తో సమన్వయం, జట్టుగా కృషి చేయడం, అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయడాన్ని అలవర్చుకోవాలని వాయు, నౌకాదళాల ఆఫీసర్స్‌కు పిలుపునిచ్చారు. అంతకుముందు క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఫ్లయింగ్ క్యాడెట్‌లకు రాష్ట్రపతి కమిషన్‌ను ప్రదానం చేశారు. శనివారం మొత్తం 204 మంది క్యాడెట్‌లు గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. వీరిలో 178 మంది పురుషులు, 26 మంది మహిళలు ఉన్నారు. భారత నౌకాదళానికి చెందిన 9 మంది అధికారులు, భారత తీర రక్షక దళానికి చెందిన 9 మంది అధికారులు, ఒక విదేశీ అధికారికి 'వింగ్స్'ను ప్రదానం చేశారు. పైలట్ల కోర్సులో మెరిట్ సాధించి మొదటి స్థానంలో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ పరాగ్ ధంకర్‌కు ప్రతిష్టాత్మక 'ప్రెసిడెంట్స్ ప్లేక్ .. చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ స్వోర్డ్ ఆఫ్ హానర్' లభించింది. గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లో మెరిట్ సాధించిన ఫ్లయింగ్ ఆఫీసర్ రామ్ ప్రసాద్ గుర్జార్‌కు ప్రెసిడెంట్స్ ప్లేక్ లభించింది. పరేడ్ అనంతరం పీసీ–7 ఎంకే–II, ఎస్‌యూ–30 ఎంకేఐ వంటి యుద్ధ విమానాలు, సారంగ్ హెలికాప్టర్లు, సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ ఎస్ శ్రీనివాసులు, ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్, పలువురు సీనియర్ ఫ్లయింగ్ ఆఫీసర్లు, క్యాడెట్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు.. అవగాహన కార్యక్రమాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): డ్రగ్స్ బారిన పడి విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల బారిన పడితే వాటి నుంచి బయటపడటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో ప్రతీ సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలుత కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం సైకాలజిస్టుల సేవలు కూడా వినియోగించుకోనున్నారు. డ్రగ్స్ వినియోగిస్తే ఎలాంటి నష్టాలు, అనారోగ్య సమస్యలు కలుగుతాయో వివరించనున్నారు.మండలాల వారీగా పాఠశాలల్లో డ్రగ్స్ అవేర్నెస్ యాక్టివిటీ చేపట్టబోతున్నట్టు అధికారులు తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌లో టీచర్ల బాధ్యత ఎంతైతో ఉందో.. తల్లిదండ్రులది కూడా అదే పాత్ర అని విద్యార్థులను తీర్చిదిద్దడంలో పేరెంట్స్ పాత్రపై కూడా వారికి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.



చెత్త డంపింగ్ యార్డ్‌ల మారిన ఇందిరాపార్క్ వద్ద ఉన్న ఎన్టీఆర్ క్రీడామైదానం

## హెచ్‌సీఎల్ సైక్లథాన్..ట్రాఫిక్ ఆంక్షలు



సిటీబ్యూరో: హెచ్‌సీఎల్ సైక్లథాన్ నేపథ్యంలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సైబరాబాద్ పరిధిలోని విప్రో, కోకాపేట, కొల్లూరు, మై హోమ్ అవతార్, నార్సింగి జంక్షన్‌లలో ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ తెలిపారు. విప్రో జంక్షన్ నుంచి కోకాపేట వైపు వచ్చే వాహనాలను టీ–గ్రిల్ వద్ద ఎడమ వైపునకు మైస్కేప్‌రోడ్, వేద ఐఐటీ, నార్సింగి, నానక్‌రాంగూడ సర్వీస్ రోడ్డు కుడి వైపు నుంచి మై హోమ్ అవతార్ ఎడమ వైపు నుంచి కోకాపేట గ్రామం మీదుగా అనుమతిస్తామని తెలిపారు. కొల్లూరు జంక్షన్ నుంచి కోకాపేట, మైహోమ్ అవతార్ వైపు వచ్చే వాహనాలను కొల్లూరు జంక్షన్ వద్ద దారి మళ్లించి ఓఆర్ఆర్‌కు కుడి వైపున ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా అనుమతిస్తామని, నార్సింగి నుంచి విప్రో వైపు వచ్చే వాహనాలను ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు వైపు దారి మళ్లించి నానక్‌రాంగూడ, ఎడమ వైపున ఖాజాగూడ సర్కిల్ మీదుగా నానక్‌రాంగూడ రోడ్డు, విప్రో సర్కిల్ మీదుగా అనుమతిస్తామన్నారు.



## చలి పంజా.. గ్రేటర్ గజగజ..

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కిందకు పడిపోతుండడంతో గ్రేటర్‌ను చలిపులి వణికిస్తోంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.0, కనిష్ఠం 17.3 డిగ్రీలు, గాలిలో తేమ 43 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున పొగమంచు ఏర్పడే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## మెట్రో స్టేషన్లపై తర్జన భర్జనలు

### ఫేస్ - 2లో మారుతున్న స్టేషన్ల సంఖ్య



సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేస్–2లో స్టేషన్ల సంఖ్యపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ తర్జన భర్జనలు పడుతున్నది. 76.4 కిలోమీటర్ల, 54 స్టేషన్లతో నిత్యం 8 లక్షల మంది ఐదు కారిడార్లలో ప్రయాణించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. అయితే తాజాగా కొన్ని మార్గాల్లో స్టేషన్లను తగ్గించే యోచనలో మెట్రో ఉన్నట్లు తెలిసింది. దీని ద్వారా ఆయా మార్గాల్లో మెట్రో వేగం పెరుగుతుందని చెబుతుండగా, ప్రస్తుతం ఉన్న కారిడార్లలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుండగా, భవిష్యత్‌లో ఈ వేగం మరో ఐదు కిలోమీటర్లు పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించారు. ఈ క్రమంలోనే మెట్రో స్టేషన్ల కుదించాలా? వద్దా అనే అంశంలో హెచ్ఏఎంఎల్ సమాలోచనలు చేస్తున్నది.

### రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో..

దాదాపు రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో మెట్రో ఫేస్–2 చేపట్టనున్నారు. 54 స్టేషన్లను ప్రతిపాదించారు. ఇందులో ప్రధానంగా కారిడార్–4లో ఉన్న నాగోల్–శంషాబాద్ మెట్రో మార్గంలో 24 స్టేషన్లు ఉండగా, 13.4 కిలోమీటర్లు ప్రయాణించే కారిడార్–7లో మియాపూర్–పటాన్‌చెరులో 10 స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో ప్రధానమైన ఎయిర్‌పోర్టు మెట్రో విషయంలో వేగాన్ని పెంచేందుకు స్టేషన్లను కుదించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ దీంతో భవిష్యత్‌లో ఈ మార్గంలో కొత్త మెట్రో స్టేషన్ల నిర్మాణం సాధ్యం కాదనే క్రమంలో.. స్టేషన్ల కుదింపు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

### మార్పులు జరిగే అవకాశం..

ప్రస్తుతం 54 స్టేషన్లతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హెచ్ఏఎంఎల్ రూపొందించి కేంద్రానికి అందజేసింది. ప్రస్తుతం కేంద్ర పరిశీలనలో ఉంది. డీపీఆర్ అధ్యయనం, పరిశీలన తర్వాత కేంద్రం పలు సూచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ప్రాజెక్టు అంచనా వ్యయం, స్టేషన్లు, భూ సేకరణ వంటి అంశాలపై కేంద్ర సూచనలకు అనుగుణంగా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. ఆ లోపే మెట్రో స్టేషన్లను కుదించి, తుది ఆమోదం కోసం రివైజ్ డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మెట్రో స్టేషన్ల కుదింపు అంశంపై మెట్రో వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం వ్యయం కూడా తగ్గనున్నది. కానీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్టేషన్ల నిర్మాణం జరగాల్సి ఉంటుంది. కానీ అనూహ్యంగా స్టేషన్ల సంఖ్యను కుదించాలని మెట్రో భావించడంపై ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పెదవి విరుస్తున్నారు. తమ ప్రాంతానికి రవాణా సదుపాయాలను కోల్పోయే ప్రమాదం ఉంటుందని, ప్రతిపాదిత ఆలైన్‌మెంట్ ప్రకారమే మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## ఎందుకంత నిర్లక్ష్యం?



### సర్కారు స్కూళ్లలో ఆహార కమిటీల ఏర్పాటులో తాత్సారం

### కొన్ని పాఠశాలల్లో మాత్రమే ప్రక్రియ పూర్తి

### మేడ్చల్ జిల్లాలో 505 ప్రభుత్వ బడులు

### విద్యనభ్యసిస్తున్న 88,600 మంది విద్యార్థులు

మేడ్చల్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ బడుల్లో ఆహార కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురువుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. మధ్యాహ్న భోజనాన్ని విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చేసుకుంటున్నా.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా దృష్టి సారించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ బడుల్లో ఆహార కమిటీలను ఇప్పటివరకు 50 శాతం బడులకు మాత్రమే ఏర్పాటు చేయగా, మిగతా 50 శాతం స్కూళ్లలో ఆహార కమిటీలను ఎప్పుడు పూర్తి చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆహార కమిటీల ఏర్పాటులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తున్నది.

### 505 ప్రభుత్వ పాఠశాలలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 88,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆహార కమిటీలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు, కొంత మంది విద్యార్థులు ఉండనుండగా, ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం వండే ముందు పాత్రలు శుభ్రంగా ఉన్నాయా.. వంట సరకులు నాణ్యమైనవి ఉండేలా చూస్తారు. వంట సరకులు నాణ్యమైనవిగా లేకుంటే తిరస్కరిస్తారు. అన్ని సరిగా ఉంటేనే వంటను ప్రారంభించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వండిన వంటను భోజనానికి ముందు రుచి, నాణ్యతను కమిటీ సభ్యులు చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాల్సి ఉంటుంది. ఆహార కమిటీల విషయంలో చర్యలు తీసుకుంటామని జిల్లాలోని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ కమిటీల ఏర్పాటులో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది.